నవంబర్ - డిసెంబర్, 2008

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక




క్రిస్మస్ శుభాకాంక్షలతో...

# క్రిస్మస్ కానుక

ఈ భూగోళం మీద ఉన్న సమస్త మానవాళి చరిత్రను రెండు భాగాలు (క్రీస్తుపూర్వం, క్రీస్తుశకం)గా చేసిన ఆరోజు, మన క్యాలెండర్‌లలో, కంప్యూటర్లలో కనిపించే తేదీలకు ఆధారమైన ఆరోజు క్రీస్తుయేసు పుట్టినరోజు. అసమానుడైన క్రీస్తు పుట్టిన ఆరోజును ప్రపంచమంతా పండుగగా ఆచరిస్తుంది. అయితే యేసుక్రీస్తు పుట్టుక ద్వారా ప్రతి మనిషికి దేవుడు సిద్ధపరచిన అమూల్యమైన బహుమానమును అనేక మంది గుర్తించలేకపోతున్నారు.

దేవుని కుమారుడైన యేసుక్రీస్తు ఈ లోకానికి రావటానికి గలకారణం ఏమిటో ఈ చిన్న ఉపమానం ద్వారా సులభంగా అర్థమవుతుంది. ఒకరోజు ఒక తండ్రి 7 సంవత్సరాల కుమారుడితో కాలువ గట్టున కూర్చుని ఉన్నాడు. ఆ కుమారుడు కాలువ ఒడ్డు అంచున ఉన్న చీమలగుంపును గమనిస్తూ ఆనందిస్తున్నాడు. నీటి ప్రవాహం పెరుగుతూ ఉండటంతో ఆ చీమలు నీటిలో పడి కొట్టుకుపోయే ప్రమాదం ఏర్పడింది. ఆ బాలుడు వాటి స్థితి చూసి చాలా బాధపడుతూ ఒడ్డుకు వచ్చేయండి లేకపోతే కొట్టుకుపోతారు అని అరుస్తున్నాడు. చీమలకు వినబడాలని ఎంత అరిచినా ఫలితం శూన్యం. అప్పుడు తండ్రి కుమారునితో ఇలా అన్నాడు. "నువ్వు ఎంత అరిచి బాధపడినా ప్రయోజనం లేదు. చీమలు నీ బాష అర్థం చేసుకోలేవు. నీవు చీమగా మారితే వింటాయి. అప్పుడు కుమారుడు నేను చీమగా మారి వాటిని రక్షిస్తాను అన్నాడు. వాటిని రక్షించుకోవాలనే తపనతో ఆ బాలుడు అమాయకంగా మాట్లాడినా, సరిగ్గా అటువంటి నిష్కల్మషమైన, నిస్వార్థమైన ప్రేమే దేవుని కుమారుడైన యేసును రక్తమాంసములు కలిగిన మనుష్యునిగా మన మధ్య జన్మింపచేసింది. దేవుడు మన భయాలను పోగొట్టి మన ఆత్మను విడిపించాలని తన సొంతకుమారుడుని మన కోసం మన మధ్యకు పంపించాడు. కన్య మరియ పరిశుద్ధాత్మ వలన గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అని పేరు పెట్టింది. తండ్రి అయిన దేవుడు నీ యొక్క జన్మ, కర్మ పాపములను సిలువలో తన కుమారుని మీద మోపి మనలకు విమోచనను సిద్ధపరిచాడు.

యేసు జన్మపునీతమైనది, ఆయన గుణము సాటిలేనిది, ఆయన జీవితము విశిష్టమైనది. యేసు జన్మించుటకు 700 సంవత్సరాలపూర్వమే ఆయన జన్మించే విధానం, జన్మస్థలం, సిలువ మరణము మరియు పునరుత్థానము గురించి దేవుడు స్పష్టమైన వివరాలను తన భక్తులద్వారా గ్రంథస్థం చేయించాడు. యేసును మించిన కారణజన్ములు ప్రపంచ చరిత్రలో మరెవ్వరులేరు. ఇక ఉండబోరు. నీ జీవితానికి జవాబు అయి ఉన్న యేసును, అమూల్యమైన క్రిస్మస్ బహుమానముగా దేవుడు నీ కొరకు పంపించాడు. దేవుని యొక్క బహుమానం నీ స్వీకరించి దేవుని దీవెనలను పొందుకొనగలవు.



నవంబర్ - డిసెంబర్, 2008 సంపుటి: 1 సంచిక: 1

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- మనస్సులోని మాట (సంపాదకీయం) ........ 2
- స్పర్శ ........ 3
- క్రీస్తు సంఘములో అనుసరించుడి..విడిచిపెట్టుడి.. ........ 6
- సహకారియైన స్త్రీ ........ 7
- ఏది ప్రాముఖ్యము? ........ 9
- సాధుసుందర్ సింగ్ జీవిత చరిత్ర - 1వ భాగము ........ 10
- మంచి మనస్సు (బాలల శీర్షిక) ........ 13
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 14
- నమ్మకత్వం ........ 16
- మరణం తరువాత నీ గమ్యము ఎటు? ........ 17
- బైబిల్ క్విజ్-1 ........ 18
- జన్మదిన శుభాకాంక్షలు ........ 20


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# “మనస్సులోని మాట”

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**


ఎపఫ్రా మినిస్ట్రీస్ నుండి **స్పర్శ** అనే ద్వీమాస పత్రికను ప్రారంభించుటకు కృప చూపిన దేవునికి స్తోత్రములు, పత్రికను చదువుతున్న మీకు వందనములు. నా ప్రార్థనలయందు మీ విషయమై విజ్ఞాపనము చేయుచూ, మీ అందరి నిమిత్తము ఎల్లప్పుడు దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాను.

ఆయా ప్రాంతములలో నివసించుచూ దేవుని కొరకు ఆశ కలిగి ఉన్నవారికి **స్పర్శ** ఎంతో ప్రయోజనకరముగా ఉంటుందని ఆశించుచున్నాను. ప్రముఖ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు శరీరములోని స్పర్శను గూర్చి అధ్యయనం చేసినపుడు ఆశ్చర్యకరమైన విషయములు తెలుసుకున్నారు. మనిషి శరీరమునకు మంచి ఆహారము, వ్యాయామము ఎంత అవసరమో స్పర్శ అంతే అవసరము. స్పర్శ లేకపోతే మానసిక, శారీరక రుగ్మతలు వస్తాయని టచ్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ అధ్యయనంలో తేలిన విషయం.

శరీరమునకే స్పర్శ అంత ముఖ్యమైనదైతే ఆత్మీయజీవితంలో హృదయమునకు స్పర్శ అంతకంటే ఎంతో ప్రాముఖ్యమైనది. హృదయమునకు స్పర్శ మాటలద్వారా కలుగుతుంది. దేవుని మాటలు హృదయములను స్పృశించుట ద్వారా హృదయము శుద్ధి చేయబడి ధన్యులుగా మార్చబడతారు. ఈ దినములలో హృదయస్పర్శ లేని వారిగా జీవించుట సాధారణమైనది. అందుకే అనేకులు సేవకులద్వారా దేవుడు తెలియపరుస్తున్న సత్యములను నిర్లక్ష్యము చేసి, గద్దింపుని లెక్కచేయక, తమని తామే మోసగించుకొనుచున్నారు. ఎక్కడ చూచిననూ కొందరు విశ్వాసులు, సంఘపెద్దలు, సేవకులు భక్తులుగా చలామణి అవుతూ హృదయ స్పర్శలేని వారిగా జీవించుట శోచనీయము.

ఈ పత్రికద్వారా దేవుని సంగతులను జ్ఞాపకము చేసి, మిమ్ములను ఆత్మలో రేపుట న్యాయమని ఎంచుకొనుచున్నాను. కాబట్టి మీ జీవితంలో హృదయ స్పర్శ కలిగినవారిగా జీవించి దేవుని రాజ్యము కొరకు ఎదురు చూస్తారని విశ్వసిస్తూ...

మీ సహోదరుడు...



# 'స్పర్శ'

– బ్రదర్ టి.ఎపఫ్రా

స్పర్శ అనగా జ్ఞానేంద్రియాలద్వారా కలిగే స్పందన. ఇది శరీర మరియు ఆత్మసంబంధమైనది. స్పర్శలే భావాలుగా మారి నిర్ణయాలై చివరికి జీవితాలను నిర్దేశిస్తాయి. శరీర సంబంధమైన స్పర్శ ఇహ సంబంధమైనది, ఆత్మ సంబంధమైన స్పర్శ పరసంబంధమైనది మరియు శాశ్వతమైనది.

సృష్టికి పునాది దేవుని మాట. దేవుని మాట శూన్యమును తాకితే సంపూర్ణమైంది. నిరాకారానికి దేవునిమాట ఆకారాన్ని ఇచ్చింది. చీకటిని దైవవాక్కు తాకగా అది వెలుగైంది. శాపకరమైన జీవితాన్ని వాక్యము స్పృశిస్తే ఆశీర్వాదముగా మారుతుంది. సృష్టి ప్రారంభమునుండి నేటి వరకు దేవుని వాక్యము మనుష్యుల హృదయాలలో కలుగజేసిన స్పర్శ పాపులను నీతిమంతులుగాను, వ్యాధిగ్రస్తులను ఆరోగ్యవంతులుగాను, లేమితో ఉన్నవారిని కలిమిగలిగినవారిగాను మార్చింది. పరిశుద్ధ గ్రంథమైన బైబిల్‌లో దైవ స్పర్శ చేత అద్భుతాలను రుచిచూచిన కొందరిని గూర్చి మనము ధ్యానిద్ధాం.




యేసయ్య శరీరధారియై యున్న దినములలో ఒక కుష్ఠ రోగి ఉండేవాడు. (మత్తయి 8:3) ఆకాలంలో కుష్ఠ వ్యాధి గలవారిని సమాజం నుండి వెలివేసి శాపగ్రస్తులుగా చూసేవారు. వారికి కలిగిన వ్యాధి బాధే కాక, ఏ మనుష్యునితో సహవాసం లేక వారు నిరాదరణకు గురి అయ్యేవారు. ఈలాంటి పరిస్థితులలో ఆ కుష్ఠరోగి యేసుని గూర్చి విన్నాడు. కాని ఆయనను స్వస్థపరచమని అడుగుటకైనను ధైర్యము లేదు.

నీకిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయమని అడుగుచున్నాడు. యేసయ్య అతనిని తాకి నాకిష్టమే శుద్ధుడవు కమ్మని చెప్పెను. వెంటనే స్వస్థత పొందెను. యేసయ్య చేతి స్పర్శ భయంకరమైన కుష్ఠ వ్యాధిని మరియు బాధను క్షణంలో స్వస్థతగాను, సంతోషముగాను మార్చి వేసింది. ఇది నిజమా! అన్నంత అద్భుతం జరిగింది. ఎంత ప్రేమ యేసయ్యకు? వెలివేయబడిన ఆ వ్యక్తిని తన చేతులతో స్పృశించి కుష్ఠవ్యాధిని బాగుచేసెను. ఆ కనికరము, దయగల తండ్రి మన జీవితములో కూడా మనలను స్పృశించి మన వ్యాధులలో మనకు స్వస్థతనిస్తాడు. యేసు నిన్న నేడు నిరంతరము ఒకే రీతిగా ఉన్నాడు. నేటికీ సజీవుడైయున్నాడు. ఆయన స్పర్శను కోరుకుంటే ఎలాంటి వ్యాధినైననూ స్వస్థపరుస్తాడు.



ఒకరోజు యేసు అరణ్య ప్రదేశానికి ఏకాంతముగా వెళ్ళెను. (మత్తయి 14:13-21) జనసమూహము ఆ సంగతి విని పట్టణముల నుండి ఆయనను వెంబడించిరి. గొప్ప జనసమూహమును చూచి వారి మీద కనికరపడి వారిలో రోగులైన వారిని స్వస్థపరచెను. సాయంకాలమైనప్పుడు ఆయన శిష్యులు భోజన పదార్థములను కొనుక్కొనుటకు జనులను పంపివేయమని ఆయనతో చెప్పిరి. కాని మీరే వారికి ఆహారము పెట్టుడని తన శిష్యులతో యేసయ్య చెప్పెను. వారు ఐదు రొట్టెలు, రెండు చేపలు తప్ప మరేమియు మా దగ్గర లేవని చెప్పిరి. యేసయ్య వాటిని పట్టుకొని ఆకాశము వైపు కన్నులెత్తి ఆశీర్వదించి శిష్యులకు ఇచ్చెను. వారు ప్రజలకు వడ్డించగా స్త్రీలు, పిల్లలు కాక, ఐదువేలమంది పురుషులు తిని తృప్తి చెందిరి. ఇంకనూ మిగిలిన ముక్కలను పన్నెండు గంపలు నిండా ఎత్తిరి. ఆర్థిక ఇబ్బందులతో, కరువుతో, అప్పులు తీర్చలేక బాధ పడుచున్నావేమో? నీకున్న కొద్ది స్థితిలోనే దేవుడు సమృద్ధిని దయచేస్తాడు.



స్థలములో కుడివైపున, ఎడమవైపున ఇద్దరు నేరస్థులను ఆయనతో కూడా సిలువ వేసిరి. ఆనేరస్థులలో ఒకడు మరియొకడిని చూచి మనకైతే ఇది న్యాయమే మనము చేసిన వాటికి తగిన ఫలం పొందుచున్నాము. కానీ ఈయన ఏ తప్పిదము చేయలేదని చెప్పి ఆయనను చూచి యేసూ, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసుకొనమనెను. అందుకు ఆయన వానితో "నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉందువని" చెప్పెను. అతను నేరస్థుడేగానీ యేసయ్య జీవితాన్ని గురించి విని పొందిన స్పర్శ అతనిని నీతిమంతునిగా మార్చి దేవుని రాజ్యానికి సిద్ధపరిచింది.

ప్రియమైన చదువరీ! జన్మ, కర్మ పాపములతో జీవిస్తున్న మానవాళికి యేసుక్రీస్తు సిలువలో కార్చిన రక్తము, పొందిన దెబ్బలు, చేసిన ప్రాణత్యాగము మరియు పునరుత్థానమును గూర్చిన సువార్త ద్వారా హృదయానికి కలిగే స్పర్శ పాపక్షమాపణను, శరీర స్వస్థతను, ఇహ సంబంధమైన ఆశీర్వాదమును, అన్నింటికంటే ముఖ్యముగా పరలోక రాజ్యమును అనుగ్రహిస్తుంది. సంవత్సరములు జరుగుచుండగా "జీవించుచున్నావు అన్న పేరు మాత్రమే ఉన్నది గానీ నీవు మృతుడవే" అని ప్రకటన 3:1 లో వ్రాయబడినట్లుగా వాక్యమును వినుచున్నావు గానీ స్పర్శ లేకుండా జీవిస్తుంటే ఈ దినమునుండి అయినను దేవుని వాక్యము నీ హృదయమును తాకినప్పుడు నీవు స్పందించి నీ జీవితమును మార్చుకొనుము. జీవితములో చివరి శ్వాస వరకు హృదయములో స్పర్శ కలిగి ఉండుము. తద్వారా ఇహ, పర సంబంధమైన ఆశీర్వాదమునకు వారసుడవు కమ్ము!

**దేవుడు నిన్ను దీవించును గాక.**

ఆమెన్...

# క్రీస్తు సంఘములో...

## అనుసరించుడి..

1. ఒకరిని ఒకరు ప్రత్యేకమైన అవయవములుగా ఎంచుకొనుడి. – (రోమా 12:4,5)
2. ఒకరికి ఒకరు సహోదర ప్రేమ విషయములో అనురాగము గలవారై యుండుడి. – (రోమా 12:10)
3. ఒకరి యందు ఒకరు ఘనత విషయములో గొప్పగా ఎంచుకొనుడి. – (రోమా 12:10)
4. ఒకరితో ఒకరు మనస్సు కలిసిన వారై ఉండుడి. – (రోమా 15: 5,6)
5. ఒకరికి ఒకరు దాసులై యుండుడి. – (గలతీ 5:13)
6. ఒకరిని ఒకరు ప్రేమతో సహించుకొనుడి. – (ఎఫెసి 4:1,2)
7. ఒకరి భారములు ఒకరు భరించుడి. – (గలతీ 6:2)

## విడిచిపెట్టుడి..

1. ఒకరికి ఒకరు తీర్పు తీర్చుకొనుట – (రోమా 14:13)
2. ఒకరికి ఒకరు వివాదమును రేపుకొనుట – (గలతీ 5:26)
3. ఒకరి యందు ఒకరు అసూయపడుట – (గలతీ 5:26)
4. ఒకరితో ఒకరు అబద్ధములాడుట – (కొలస్సీ 3:9)
5. ఒకరికి ఒకరు ద్వేషించుకొనుట – (తీతు 3:3)
6. ఒకరికి ఒకరు విరోధముగా మాటలాడుకొనుట – (యాకోబు 4:11)
7. ఒకరి మీద ఒకరు సణుగుకొనుట – (యాకోబు 5:9)



# "సహకారియైన స్త్రీ"

- సిస్టర్ వి. విజయ

**మరియు దేవుడైన యెహోవా నరుడు ఒంటరిగా నుండుట మంచిది కాదు. వానికి సాటియైన సహాయమును వాని కొరకు చేయుదుననుకొనెను. (ఆదికాండము 2:18)**

దేవుడు ఆదామును ఒంటరిగా విడిచిపెట్టకుండా, అతని ప్రక్కటెముకలలో నుండి ఒక ఎముకను తీసి, స్త్రీగా సృజించారు. ఎందుకనగా పురుషుడైన ఆదాము జీవితములో బలహీనత కలిగినపుడు బలపరుచుటకు, అధైర్యములో ధైర్యపరచుటకు, క్రుంగిన స్థితిలో ఆదరణను కలిగించుటకు, కుటుంబ పరిస్థితులన్నిటిలో సహాయము చేయుటకు స్త్రీని దేవుడు సృజించారు.

సహాయము చేయుట అనునది చాలా శ్రేష్ఠమైనది. కుటుంబ జీవితములో స్త్రీయొక్క పాత్ర చాలా విలువైనది. ఒక కుటుంబము ఆశీర్వదించబడాలన్నా, శ్రేష్ఠమైన అనుభవములలో నిలిచి ఉండాలన్నా స్త్రీయే కారణము. వివాహము జరిగిన తరువాత సమాజంలో స్త్రీ ప్రత్యేకమైన బాధ్యతలను నెరవేర్చవలసియున్నది.

**1. భర్తకి మంచి భార్యగా స్త్రీ:** కుటుంబములో సహాయము చేసేవారిగా ఉన్నప్పుడు మంచి భార్యలవలె ఉంటారు. భార్యయైన స్త్రీ ఎల్లప్పుడూ తన కుటుంబమును సమాధాన సంతోషములతో శ్రేష్ఠమైన అనుభవములలోకి నడిపించుకోవాలనే తపన, ఆశ కలిగి ఉండాలి. 1కొరింథీ 11:3 లో చెప్పబడినట్లుగా స్త్రీకి శిరస్సు పురుషుడు. ఏ కుటుంబమునకు పురుషుడు శిరస్సుగా ఉంటాడో, యజమానిగా ఉంటాడో ఆ కుటుంబము ఎల్లప్పుడూ సంతోష సమాధానములతో జీవిస్తూ ఆత్మీయంగా ముందుకి వెళ్ళుచూ ఉంటుంది. శిరస్సు అయిన భర్తకి లోబడుచూ భార్య ఆ కుటుంబంలో జీవించాలి. ఆ కుటుంబమునకు క్రీస్తు తోడుగా ఉండి ప్రతీ అవసరతను తీరుస్తూ నడిపిస్తారు. నాప్రియ సహోదరీ! నీ భర్త చదువు, అందము, సంపాదన, లేమితో ఉన్ననూ మనసులోనైననూ హీనపరిచే స్వభావమును కలిగి ఉండకూడదు. బైబిల్లో ఒక రాజు భార్య, భర్తను మనసులో హీనపరుచుట వలన జీవిత కాలమంతా ఆమె గర్భము మూయబడినది. కనుక పూర్ణహృదయంతో భర్తని గౌరవించే వారిగా ఉండాలి. సామెతలు 21:19 లో చెప్పబడినట్లుగా జగడగొండులుగాను, భర్తను విసిగించే వారిగా ఉండకూడదు.

భర్తయొక్క లోపములను ఎత్తి చూపించి అవి అనేకులకు అనగా తల్లిదండ్రులైన వారికి ఇరుగుపొరుగు వారికి ప్రచారము చేసేవారిగా ఎంతమాత్రం ఉండకూడదు. హవ్వ ఒంటరిగా ఉన్న

సమయం చూచి సాతాను మోసము చేసినట్లు, మన ఒంటరి సమయములలో కూడా అనేకమైన ఆలోచనలద్వారా సాతాను మోసము చేయాలని చూస్తాడు. అందుకే భర్త ఆలోచనలకు విలువనిచ్చి మేమిద్దరము ఏకశరీరమని ధైర్యంగా సాతానుని ఓడించే మంచి భార్యలవలె కుటుంబములో జీవించాలనే తీర్మానము కలిగి వుందాము.

**2. పిల్లలకు మంచి తల్లిగా స్త్రీ:** కుటుంబములో తల్లి స్థానం ఎంతో ప్రాముఖ్యమైనది. పిల్లలు తల్లిని గమనిస్తూ ఉంటారు. అందుకే తల్లి ప్రభావం పిల్లలమీద ఎంతో ఉంటుంది. పిల్లలకి మంచి మాదిరి తల్లి. పిల్లలు చేసే తప్పులను సమర్థించే తల్లిగా ఉండకూడదు. నా పిల్లలు దేవునిలో యదార్థంగా జీవించాలనే ఆశ వారిని ఎప్పటికైనా దేవునిలో నిలిపి ఉంచుతుంది. బైబిల్ గ్రంధములో ఒక తల్లిని మనము చూద్దాము. ఆ తల్లిపేరు యోకెబెదు అనగా యెహోవా మహత్యము గలవాడు అని అర్ధము. తండ్రి పేరు ఆమ్రాము అనగా అనుభవము లేనివాడు. వీరికి ముగ్గురు సంతానం. ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. ఆ పిల్లలను ఆమె ధనాపేక్షలేనివారిగా, పదవులపై ఆశలేని వారిగా, దేవుని కొరకు త్యాగపూరితమైన జీవితాన్ని జీవించేవారిగా తీర్చిదిద్దింది. వారిలో మోషే అనే కుమారుడిని దేవుని ప్రజలకొరకు సాత్వికునిగా జీవించే వానిగా చేసింది. అందుకే మోషే మంచి నాయకునిగా, అహరోను అనే కుమారుడు ప్రధాన యాజకునిగా, మిర్యాము అనే కుమార్తె మంచి ప్రవక్త్రినిగా మార్చబడ్డారు. కావున ప్రియ సహోదరీ! మాదిరియైన మంచి తల్లిగా ఉండి మీ పిల్లలను దైవభయముతో పెంచడం ద్వారా రాబోవు కాలంలో వారు దేవునికి, సమాజమునకు గొప్ప ప్రయోజకులుగా మార్చబడతారు.

**3. సంఘములో మంచి ఉపకారిగా స్త్రీ:** నూతన నిబంధన సంఘములో స్త్రీ పాత్ర ప్రత్యేకమైనది. 2000 సంవత్సరాలక్రితం ప్రభువైన యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చి మన పాపములు క్షమించటానికి సిలువపై ఆయన రక్తం కార్చి, మరణించి సమాధిచేయబడెను. ఆయన మూడవ దినమున మరణం నుండి తిరిగి లేస్తారని తెలిసిన ఆయన శిష్యులు ఒక గదిలో భయపడి కూర్చుని ఉండగా ముగ్గురు స్త్రీలు పెందలకడనే ప్రభువు దేహముంచిన సమాధి దగ్గరకు వచ్చి ప్రభువు తిరిగి లేచెను అన్న సంగతి దూతలద్వారా తెలుసుకొనిన వారై "**యేసులేచెను**" అను సంగతిని మొట్టమొదటిగా శిష్యులకు తెలిపిరి. ఆహా! ఎంత గొప్ప ధన్యత మొట్టమొదట సువార్త చెప్పిన స్త్రీలు వారే.

పేతురు అనే శిష్యుడు సువార్త బోధిస్తున్నపుడు రాజైన హేరోదు చెరసాలలో వేయించి 64 మంది సైనికులను కాపలా ఉంచెను. ఆ సమయంలో ఒక స్త్రీ తన ఇంటిలో ప్రార్ధించుటకు అవకాశమిచ్చెను. ఆ ప్రార్థన ద్వారా దేవుడు దూతను పంపి పేతురును చెరసాలనుండి విడిపించెను. ఎంత ఆశ్చర్యము! ఒక స్త్రీ బాధ్యతతో తీసుకున్న నిర్ణయము ఒక గొప్ప సేవకుడి ప్రాణమును కాపాడుటయే కాక తరువాత కాలంలో గొప్పసేవ చేయుటకు కారణమాయెను.

నా ప్రియ సహోదరి! స్త్రీ పాత్రలో ఉన్న నీ జీవితము దేవునికి ఎంతో విలువైనది అని మరిచిపోవద్దు. యెహోవా యందు ఆనందించుచూ, ఆ ఆనందము ద్వారా బలము పొందుకొని భర్తకు లోబడి, బిడ్డలను ప్రేమించే మంచి తల్లిగా, సంఘములో బాధ్యత కలిగి నమ్మకమైన దానిగా ఉండుట వలన దేవుడు నిన్ను, నీ కుటుంబమును ఆశీర్వదించి, రాబోవు కాలము విషయమై నిర్భయముగా నిలిపి ఉంచుతారు! ఆమెన్!

# ఏది ప్రాముఖ్యము?

రాజకీయ నాయకులు అన్నిటికంటే ముఖ్యముగా తమ పదవిని కాపాడుకుంటారు. సినిమా తారలు అన్నిటికంటే ముఖ్యముగా తమ అందమును కాపాడుకుంటారు. క్రీడాకారులు ముఖ్యముగా తమ ఫిట్‌నెస్‌ని కాపాడుకుంటారు. ఈ విధంగా చెప్పుకుంటూ వెళ్తే ఈ లోకంలో ప్రతి మనుష్యుడు ఏదో ఒక దానిని తన జీవితంలో కాపాడుకోవటానికి నానా తంటాలు పడుతూ ఉంటాడు. ఈ మధ్య వార్తలలో ప్రముఖ పాప్‌సింగర్ తన ప్రాణమును కాపాడుకోవటానికి తన పిల్లలను కూడా దగ్గరకు తీసుకోడని ఎందువలనంటే వారి ద్వారా తన శరీరంలోనికి హానికారక వైరస్ ప్రవేశించి తన ప్రాణము పోగొట్టుకొనవలసి వస్తుందని తనని తాను కాపాడుకుంటున్నాడని తెలిసింది. చూశారా! ఎంత విచిత్రమైన సంగతి.



కానీ అతి ముఖ్యముగా కాపాడుకోవలసినది ఒకటి ఉన్నదని బైబిల్ స్పష్టముగా చెప్పుచున్నది. “నీ హృదయములో నుండి జీవధారలు బయలుదేరును కాబట్టి అన్నిటి కంటె ముఖ్యముగా నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము”. సామె 4:23

హృదయమును భద్రముగా కాపాడుకొనుటకు ఎందుకింత ప్రాముఖ్యత? సంతోషముగా ఉండుటకంటెను తమ బ్రతుకును సుఖముగా వెళ్ళబుచ్చుట కంటెను, శ్రేష్టమైనదేదియూ నరులకు లేదని నేను తెలుసుకొంటిని అని గొప్ప జ్ఞానవంతుడు, రాజైన సొలొమోను చెప్పటము జరిగింది. ప్రసంగి 3: 12

హృదయమును కాపాడుకొనుట వలన సంతోషముగా ఉండుట, సుఖంగా జీవించుట, పరలోక రాజ్యమునకు చేరుట జరుగును. సృష్టిలో మొట్టమొదటి మనుష్యులైన ఆదాము, హవ్వలసంతానమైన హేబేలు, కయీను ఎంతో సహోదర ప్రేమతో ఉండవలసిన వారు. కానీ కయీను తన తమ్ముడైన హేబేలు తనకంటే మంచి అర్పణను దేవునికి ఇచ్చుట ఓర్వలేక అసూయతో తన తమ్ముడిని చంపి వేయుట జరిగింది. హృదయములో నుండి బయలుదేరిన అసూయ కయీనుని నరహంతకునిగా మార్చింది. ఆ తరువాత జీవితకాలమంతా అతను దేశదిమ్మరిగా తిరిగాడు. ఏ నరహంతకునిలోను నిత్యజీవము ఉండదు అని బైబిల్ చెపుతుంది. హృదయమును అసూయ నుండి కాపాడుకోలేకపోవుట వలన సంతోషము లేక బ్రతుకును సుఖముగా కొనసాగించలేము.

ప్రియ చదువరీ! నీ హృదయమును భద్రముగా కాపాడుకొని, సంతోషముగా ఉండి, నీ జీవితములో సుఖంగా జీవించి, నిత్యజీవమునకు వారసుడవు కమ్ము.

– ఎడిటర్

# సాధుసుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 1వ భాగము**



**పరిచయం:-** భారతదేశములో సిక్కు మతములో జన్మించి, బాల్య దినములలోనే క్రైస్తవ్యమును ద్వేషించి, పరిశుద్ధ గ్రంధమైన బైబిల్‌ను చింపివేసి, కాల్చివేసి, క్రీస్తును ఎదిరించి, 15 సంవత్సరాల యౌవ్వనకాలములో తన యొక్క సత్యాన్వేషణలో క్రీస్తును దేవునిగా తెలుసుకొని, ఆయనను అంగీకరించుట వలన సిక్కుమతము నుండి, కుటుంబం నుండి వెలి వేయబడెను. అయినను దేవుని విడిచిపెట్టక శ్రమలను అనుభవించుచూ, ఆత్మాభిషేకముతో నింపబడి క్రీస్తును ప్రపంచమునకు చూపించుచూ, అనేకులజీవితములను ప్రభావితము చేసిన సాధుసుందర్‌సింగ్ గారి జీవిత చరిత్రను చదివి, మీ జీవితములలో మేలును పొందవలెనని మీకు పరిచయము చేయుచున్నాము.

**బాల్యము:-** తెల్లవారుఝామున 4.30 గంటలు కావస్తుంది. యౌవనుడైన సుందర్ తన గదిలో అసహనంగా తిరుగుచున్నాడు. తాను అనుకున్న సమయం అయిపోవడానికి ఇంకా అరగంటే ఉంది. కానీ తాను ఎంత ప్రార్ధించినా అదృశ్యుడైన దేవుడు ఇంకా ప్రత్యక్షం కాలేదు. ఆతురత ఎక్కువై హృదయంలోనూ, మనసులోనూ చెలరేగిన ఈ కల్లోలాన్ని ఇంకా ఏమాత్రము భరించలేని స్థితికి వచ్చాడు సుందర్. లూధియానా ఎక్స్‌ప్రెస్ మరో అరగంటలో పంజాబ్ మైదానములమీదుగా దూసుకొని వచ్చి తమ తోట ప్రక్కనుండే వెళ్తుందని సుందర్‌కి తెలుసు. తన కోరికను అదుపులో పెట్టేసమయం దగ్గరకు వచ్చిందని తలంచాడు సుందర్. 5 గంటలలోగా ఆ దేవుడెవరో తనకు ప్రత్యక్షం కాలేదంటే రాబోయే ఆ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నాడు. 15 సంవత్సరాలవయసు గలఈ యువకుడైన సుందర్ ఇలాంటి కఠిన నిర్ణయమును తీసుకున్నాడంటే బలమైన కారణము ఉండి తీరాలి.

సుందర్ తల్లి దైవభక్తి కలిగిన స్త్రీ. సుందర్ నిద్రనుండి లేచేటప్పటికే ఆమె స్నానము చేసి, శుభ్రమైన దుస్తులు ధరించి

హిందూగ్రంథములన్నిటిని చదువుతూ ఉండుట అతని బాల్యదినములలోనే గ్రహించాడు. తన కన్నులతో చూడలేని ఎవరినోగాని, దేనినోగాని తన తల్లి వెదుకుతుందని సుందర్ గ్రహించాడు. సుందర్‌కి అర్థము అయ్యే వయసు రాగానే తల్లివలె ఉదయమునే లేచి స్నానము చేసి మత గ్రంథములన్నింటిని చదువవలెనని, ఆ తరువాతే ఏదైననూ తినాలని తల్లి చెప్పేది. అంతకన్నా ముందుగా ఏమైనా తినడానికి పెట్టమని ఎన్నిసార్లు మారాం చేసినా ప్రయోజనము ఉండేది కాదు. కాలక్రమముగా సుందర్ దినచర్యలో ఇది ఒక భాగంగా మారిపోయింది. పసితనము నుండి బాల్యములోనికి అడుగు పెట్టిననూ తల్లి ప్రభావము సుందర్‌పై ఎంతగానో ఉన్నది.

సుందర్ ఎల్లప్పుడు తల్లి తనను బాగా చూచుకుంటుందని చాలా ధైర్యంగా ఉండేవాడు. ఆమె ఎంత పనిలో ఉన్ననూ, పనివాళ్ళను అజమాయిషీ చేస్తూనే సుందర్‌ని గమనించుకుంటూ ఉండేది. సుందర్‌కి ఇష్టమైన కూరలు చేసి, కొసరికొసరి తినిపించేది. సుందర్‌కి కొన్ని కూరలు అంతగా ఇష్టము లేకపోయిననూ అన్నలవలె బలంగా అవ్వాలని బోధిస్తూ తినిపించేది. సుందర్ యొక్క కోరికను తీర్చడములో తల్లి ఎంత మాత్రము నిర్లక్ష్యమును చూపేది కాదు. మనసుకు ఏమైననూ బాధ కలిగిననూ, దెబ్బలు తగిలిననూ తల్లికొంగు పట్టుకొని తిరిగేవాడు.


సుందర్ తల్లి సిక్కు మతస్తురాలైనప్పటికిని ఆధ్యాత్మిక సత్యములన్నీ సిక్కుమతములోనే దొరుకుతాయని తలంచలేదు. ఆమె సుందర్‌కు మొదటి ఉపాధ్యాయురాలిగా హిందూ గ్రంథములు నేర్పించింది. సుందర్‌కు 7 సంవత్సరాలవయసు వచ్చేటప్పటికి అన్ని గ్రంథములను కంఠోపాఠముగా నేర్చుకున్నాడు. నా కుమారుడు నేర్చుకొనినదానిని పరీక్షించుడి అని సుందర్ తల్లి ఒక దినము ఎండలో ప్రయాణము చేయించి అరణ్యములో ఉన్న ఒక వృద్ధ సాధువు దగ్గరకు సుందర్‌ని తీసుకొని వెళ్ళింది. ఆ స్థలము అదృశ్యుడైన దేవుని వేదికేందుకుగాను, ఐహిక ప్రపంచమునకు దూరంగా, ప్రశాంతముగా, గంభీరముగాను, భయభక్తులతో నిండిన వాతావరణముతో ఆకట్టుకొనేదిగా ఉన్నది. ఆ సాధువు సుందర్‌ని చూచినప్పుడు, సుందర్ ఏమాత్రము భయపడక సాధువు అడిగిన ప్రశ్నలన్నిటికి నిర్భయముగా, స్పష్టముగా జవాబు ఇచ్చాడు.

దేవునికి ఇష్టులముగా ఉండటము ఎలాగా? అన్న మొదటి ప్రశ్నకు "తల్లిదండ్రులు, పితరులు నేర్పిన ఆజ్ఞలకు లోబడడం ద్వారానే" అని జవాబిచ్చెను. ఈ జవాబు విన్న సాధువు మెచ్చుకున్నట్లుగా తలఊపి ఎంతో చక్కగా జవాబు ఇస్తున్న ఈ

కుర్రవాడు భవిష్యత్తులో సాధువు అవుతాడేమో అని అన్నాడు. ఈ మాటలు విన్న సుందర్ తల్లి ఎంతో ఆనందించింది. ఏ విధంగానైననూ తన కుమారుడు సాధువుగా మారాలన్నదే ఆమె కోరిక. సుందర్ కూడా తల్లి కోరికను గుర్తించాడు. సాధువు అయి పోవడంలోని భావం అంత చిన్న వయస్సు కలిగిన సుందర్‌కు తెలియలేదు గాని, తన తల్లి ఎవరెవరి యొద్దకు వెళ్ళుచుండేదో ఆ భక్తులు వెదుకుచున్నదేమిటో సుందర్‌కి తెలిసిపోయింది. హృదయంలో నెమ్మదిని, ఆత్మశాంతిని ఆసక్తిగా వెదికినపుడే దొరుకుతాయని తల్లి సుందర్‌కి వివరించింది. ఈ లోకంలో సంతోషించడం, అభివృద్ధిచెందడం, భోగభాగ్యాలను అనుభవించడం, ఆనందం పొందడానికి మరెన్నింటినో చేయడం ఇవన్నీ హృదయంలో దొరికే శాంతి ముందు దిగదుడుపే. ఆధ్యాత్మికమైన శాంతిని సంపాదించడము అనేది అంత సులువైన పని కాదని సుందర్‌కి చెప్పింది అతని తల్లి. అయితే ఈ ఆత్మశాంతిని సంపాదించుకోవాలని తానెంతో తాపత్రయ పడుచున్నానని తన కంటే ముఖ్యంగా తన కుమారుడైన సుందర్ పొందాలని తన తపన అని చెప్పింది సుందర్ తల్లి.

పొరపాట్లు చేయకుండా ఉండుట ఎంతో ప్రాముఖ్యమని, అందరి యెడల మరి ముఖ్యముగా కష్టంలో వున్నవారి యెడల దయ చూపాలని బోధించింది. పేదలకును, సాధువులకు, సన్యాసులకు తన తల్లి భోజనం పెట్టడం ఆసక్తిగా గమనించాడు సుందర్. లోక జీవితం అనుభవించకుండా సర్వసంగ పరిత్యాగులైన వారు సాధువులు కాగా ఆస్థి గొడవలతోను, అప్పుల బాధలతోను సమస్తాన్ని వదిలివేసినవారు సన్యాసులు. (ఇంకా ఉంది)

-- సేకరించబడింది.





# "మంచి మనస్సు"

Hai Children! ఈ పత్రిక ద్వారా మీతో మాట్లాడటానికి అవకాశం వచ్చినందుకు నేను చాలా సంతోషించుచున్నాను. మీరు ఎలా ఉన్నారు? సంతోషముగా ఉన్నారా? ఎవ్వరూ నన్ను మెచ్చుకోవట్లేదని, ఏది చేసినా తప్పే అంటున్నారని కోపం వస్తుందా? ఎవరూ స్నేహం చేయట్లేదని బాధపడుతున్నారా? మీరు ఇంకొకరికి మంచి స్నేహితునిగా ఉండాలంటే ఏం చేయాలో చెప్పాలనుకుంటున్నాను.

ఒక స్కూల్లో రామ్ బహు తుంటరి. అతను స్కూల్లో తోటి పిల్లలతో చెడుగా ప్రవర్తించేవాడు. పిల్లలబుక్స్ చింపేయటం, పెన్సిల్స్ దొంగిలించటం, బ్యాగ్స్ పాడుచేయడం, వాళ్ళని గిల్లటం, కొట్టడం, టీచర్స్ పాఠాలు చెప్పేటప్పుడు మాట్లాడటం ఇలా అందరినీ విసిగించి కోపం తెప్పించేవాడు. రామ్ అంటే ఎవరికీ ఇష్టం ఉండేది కాదు. ఇతనికి అందరూ దూరంగా ఉండేవారు. తోటి విద్యార్థుల పేరెంట్స్ ఇంటికి వచ్చి కంప్లైంట్స్ ఇచ్చేవారు. ఇక తల్లిదండ్రులు కూడా రామ్ అంటే విసుగుచెంది, తిట్టి, కొట్టేవారు, కానీ ప్రేమించేవారు. ఆ ప్రేమను అర్థం చేసుకోలేకపోయేవాడు రామ్.

ఆ స్కూల్‌లో మరొక విద్యార్థి ఉన్నాడు. అతని పేరు శ్యామ్. శ్యామ్ ఎప్పుడూ రామ్‌ను పలకరించటానికి, ప్రక్కన కూర్చోవటానికి ఇష్టపడేవాడు. బుక్స్ చింపినా ఎప్పుడూ ఏమీ అనకుండా స్నేహం చేయాలనుకునేవాడు. రామ్‌కి ఆశ్చర్యం కలిగేది. శ్యామ్ ఎందుకు నన్ను తిట్టడు? కోపగించుకోడు? అని ఆలోచించేవాడు.

ఒకరోజు రామ్, శ్యామ్ ఇంటికి వెళ్ళేసరికి శ్యామ్ ప్రార్థించుకోవటం గమనించాడు, ప్రక్కన ఉండి వింటున్నాడు. శ్యామ్, రామ్ కొరకు కన్నీటితో ప్రార్థించుచున్నాడు. ఆ ప్రార్థన విన్న రామ్ కన్నీరు కార్చాడు. తనను శ్యామ్ ఎందుకు ఇంతగా ప్రేమిస్తున్నాడో అర్థంకాలేదు. తరువాత శ్యామ్‌తో మాట్లాడేసరికి యేసయ్య ప్రేమగురించి, క్షమాపణ గురించి చెప్పిన సంగతులు విని, ఎందుకు శ్యామ్ తనని ప్రేమిస్తున్నాడో, ఓర్చుకుంటున్నాడో అర్థమైంది. వెంటనే తన చెడు ప్రవర్తనను మార్చుకుంటానని శ్యామ్‌తో చెప్పాడు. ఇద్దరూ కలిసి యేసయ్యకి ప్రార్థన చేశారు. ఆ దినం నుండి రామ్‌లో గొప్పమార్పు కలిగింది.

చూశారా పిల్లలూ! ఒకరి ప్రేమ, మంచి మనస్సు ఎంత అద్భుతాన్ని చేసిందో, తల్లిదండ్రులవలన కానిది, స్కూల్ టీచర్స్ వలన కానిది, ఒక మంచి ఫ్రెండ్ వలన దేవుడు రామ్‌లో మార్పు కలిగించాడు. కాబట్టి మీరు కూడా శ్యామ్‌వలె క్షమించేవారిగా, ప్రేమించేవారిగా, ప్రార్థించేవారిగా ఉంటారుగా! ఇక ఉంటాను మరలా కలుద్దామా!

HAPPY CHRISTMAS CHILDREN

టాటా.. బైబై...

మీ.. అక్కయ్య...

# “నా జీవితములో దేవుని మేలులు”

– పి.సమ్సోను, నంద్యాల

ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీ అందరికీ హృదయపూర్వక వందనములు. నా పేరు సమ్సోను. నేను ఒక నామకార్థమైన క్రైస్తవ కుటుంబములో పుట్టి పెరిగాను. నేను మెకానికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమో చదువుతుండగా మారుమనస్సు నిమిత్తము బాప్తీస్మము తీసుకున్నాను. అయినను దైవభయము లేకుండా స్నేహితులతో కలిసి పొగ త్రాగుట మరియు మద్యము సేవించుట జరిగేది. ఇంజనీరింగ్ అయిన వెంటనే నాకు వివాహము జరిపించారు.

తరువాత కొద్ది దినములకు స్నేహితులతో కలిసి వ్యాపారము చేద్దామని ఆలోచించి ఒక లారీని కొన్నాము. మేము చేస్తూ ఉన్న వ్యాపారంలో నష్టములు వచ్చి అప్పులు పాలయ్యాను. నా పరిస్థితిని గమనించిన నా స్నేహితులు నామీద చాలా నిందలు మోపి, నాకు దూరమైపోయారు.

ఈ పరిస్థితిలో 2004వ సంవత్సరములో ఏదైనను ఒక ఉద్యోగము చేద్దామని హైదరాబాద్ రావటము జరిగింది. తరువాత ఒక ప్రైవేట్ కంపెనీలో రెండు వేల రూపాయిల జీతమునకు ఉద్యోగములో చేరాను. కుటుంబమును హైదరాబాద్‌కు తీసుకొని వద్దామంటే నేను, నా భార్య, ఇద్దరు పిల్లలతో కుటుంబము గడవడము వచ్చే రెండు వేలతో కష్టము. కానీ కలిసి ఉండాలని వారిని కూడా తీసుకురావటము జరిగింది. ఇంకా నేను మాత్రము అప్పులగురించి ఆలోచిస్తూ నిరాశలచేత కృంగిపోయి చాలాసార్లు ఆత్మహత్యే శరణ్యమని అనుకుంటూ ఉండేవాడిని.

ఈ పరిస్థితిలో నా భార్య తన అనుదిన ప్రార్థనలో మాకు మంచి సహవాసమును దయచేయమని దేవుని వేడుకొనుచుండెను. ప్రార్థనను ఆలకించిన దేవుడు ఎపఫ్రా మినిస్ట్రీస్‌ను మాకు పరిచయం చేశారు. అక్కడి దైవసేవకుల బోధలు వింటున్నప్పుడు నాకు మరల జీవితము మీద ఆశలు కలుగుచుండెడివి. దైవ సేవకులు మా పరిస్థితి అంతయు తెలుసుకొని, మా కొరకు ప్రార్థించేవారు. మరియు ఆదరణకరమైన దేవుని మాటలు మాకు చెప్పి మమ్మును ధైర్యపరిచి, దేవుని కొరకు సాక్షులుగా జీవించాలి అని ప్రోత్సాహపరిచేవారు. అలా రోజులు గడుస్తూ ఉండగా, ఒకరోజున వార్తాపత్రికలో ఒక ప్రకటనను నేను చూసాను. అది ఏమిటంటే ఒక కిడ్నీ కావాలని, దాని కొరకు వారికి కొంత డబ్బులు ఇవ్వబడతాయి అని ఉంది.

ఋణభారములలో ఉన్న నేను అది చదివి నా కిడ్నీ ఒకటి ఇచ్చి నా ఋణభారముల నుండి విముక్తి పొందాలనే ఆలోచన చేసాను. అదే రోజున నేను దేవుని మందిరమునకు వెళ్ళి ఆరాధనలో ఉండగా, పరిశుద్ధాత్మ దేవుడు వాక్యము ద్వారా నాతో మాట్లాడారు. “నా ప్రాణమా, నీవేల కృంగియున్నావు? నాలో నీ వేల తొందరపడుచున్నావు? దేవుని యందు నిరీక్షణయుంచుము, ఆయనే నా రక్షణకర్త నా దేవుడు” అని మాట్లాడినప్పుడు నాకు గొప్ప ధైర్యము కలిగింది. అది మొదలుకొని నాలో ఉన్న ఆలోచనలకి స్వస్తి చెప్పి, నిరీక్షణతో ఉంటే దేవుడు తప్పక నా జీవితములో ఉన్న సమస్యలనుండి విడిపించి, ఆశీర్వదిస్తారనే ధైర్యము కలిగింది. తరువాత దైవసేవకుల మాట చొప్పున నా జీవితమును మార్చుకున్నాను. దేవుడు నన్ను ప్రేమించి నా కొరకు తన ప్రాణము పెట్టారు కనుక ఇక నేను చనిపోనక్కరలేదు అని గ్రహించాను.

మొదట ఆయన రాజ్యమును, నీతిని వెదికినయెడల అప్పుడు అవన్నియు అనుగ్రహించబడును అన్న వాక్యము ప్రకారము నా జీవితమును మార్చుకొని మొదట ఆయన రాజ్యమును, నీతిని వెదికినప్పుడు కనికరించి వేరొక ఉద్యోగములో ఆరువేల రూపాయలకి జాయిన్ కావటానికి సహాయము చేశారు. అంత మాత్రమే కాక ఇప్పుడు పదిహేను వేలు జీతము తీసుకోవడానికి సహాయము చేశారు. మా కుటుంబమును ఇరుకులో నుండి విశాలతలోనికి నడిపించి, నా జీవితములో ఉన్న ఋణ భారములనుండి విడుదలపొంది సంతోషముగా జీవించునట్లుగా చేశారు.

మరి ముఖ్యముగా ఆత్మహత్య చేసుకొని నరకమునకు వెళ్ళవలసిన నన్ను దేవుని ఉచితమైన కృపతో రక్షించి ఆత్మీయముగాను, ఆర్థికముగాను అన్ని విషయములలో ఆదరించి బలపరచి మంచి పరిచర్యలో నిలిపి ఉంచిన దేవునికి ఏమి ఇచ్చిననూ నేను ఋణస్థుడనే. నా జీవితకాలమంతా నేను, నా కుటుంబము ఆయననే స్తుతించెదము. దేవునికే మహిమ కలుగును గాక!


**ఎపఫ్రా మినిస్ట్రీస్ - 2009**

నూతన సంవత్సర కాలెండర్స్ కొరకు సంప్రదించండి.

బ్రదర్. **పి.రవీందర్,**

ఎపఫ్రా మినిస్ట్రీస్, హైదరాబాద్. సెల్: 99631 17628

# నమ్మకత్వం

క్రీస్తుయేసును ఎరిగిన ప్రతి ఒక్కరికి నమ్మకత్వం అనేది అతి ప్రాముఖ్యమైన స్వభావం. నమ్మకత్వం అంటే మనము దేనిని విశ్వసించుచున్నామో లేక దేనిని నమ్ముతున్నామో దానికొరకు ప్రాణాన్ని ఇవ్వటం. ఒక వ్యక్తి నమ్మకస్థుడు అని ఎలా తెలుస్తుందంటే అతనికి అప్పగించిన బాధ్యతలను, పనులను సక్రమముగా నిర్వహించడం తెలుస్తుంది. దేవుడు కూడా కోరుకునేది ఈ నమ్మకమైన స్వభావం కలిగిన వ్యక్తులనే. పరిశుద్ధ గ్రంథములో అనేకులు దేవునికి నమ్మకంగా జీవించి దేవునికి ఇష్టులుగా మార్చబడ్డారు. అయితే వారిలో మనము ఎక్కువగా ధ్యానించని కొద్దిమందిని గురించి తెలుసుకుందాము.

**ఎపఫ్రా** (కొలస్సీ 1:7, 4:12) అనే వ్యక్తిని దేవుడు కొలస్సయిలో ఉన్న సంఘమునకు పరిచారకుడిగా నియమించాడు. అపొస్తులుడైన పౌలు ఇతనిని గురించి చెబుతూ "ఇతడు మా విషయంలో నమ్మకమైన క్రీస్తు పరిచారకుడు." సంఘముకొరకు ప్రార్థనలో పోరాడువాడు మరియు దేవుని పనిలో బహు ప్రయాసపడు చున్నాడని సాక్షమిచ్చెను. నీవు కూడా దేవుని సంఘములో ఈలాంటి మంచి సాక్ష్యము కలిగి దేవునికి నమ్మకస్థునిగా జీవించు.

**యెఫ్తా కుమార్తె** యౌవ్వనకాలంలో దేవునికి, తన తండ్రికి నమ్మకస్థురాలుగా జీవించింది. తండ్రి, దేవునికి ఇచ్చిన మాట చొప్పున జరిగించమని, తన యౌవ్వనకాల ఆశలను, ఆనందమును, ఉన్నతంగా జీవించాలనే ఆలోచనలను ప్రక్కనపెట్టి తన తండ్రి మ్రొక్కు కొనిన మ్రొక్కుబడి చొప్పున ప్రాణాన్ని సహితము బలిగా అర్పించింది. (నిర్గమ 11:36) నమ్మకస్థులుగా జీవిస్తే సొంత కోర్కెలకు, తిరుగుబాటుకు తావులేదు. ఏపని చెప్పినా ఎదురు ప్రశ్నించకుండా ఆ పనిని నమ్మకంగా చేస్తారు.

ప్రస్తుతం భార్యాభర్తల మధ్య పరస్పరం నమ్మకత్వము లేకపోవడం వలన కుటుంబ జీవితాలు విఛిన్నం అవుతున్నాయి. ఒక నమ్మకమైన కుటుంబమును పరిశుద్ధ గ్రంథములో మనము చూడగలము. **అకులప్రిస్కిల్ల** అను వీరు మొదట ఒకరికి ఒకరు నమ్మకంగా ఉంటూ, తమను నడిపించే దైనజనుడైన పౌలుకు నమ్మకస్థులుగాను, పౌలుకొరకు ప్రాణాన్ని సయితము ఇచ్చేంతగా నమ్మకమైన సేవ చేశారు.

మనము దేవునికి నమ్మకస్థులమైతే దేవుని కొరకు ప్రాణమిచ్చే వ్యక్తులుగా ఉంటాము. అదే విధంగా కుటుంబానికి, సంఘానికి, సమాజానికి నమ్మకముగా జీవించి దేవునిచే భళా! నమ్మకమైన మంచి దాసుడా అనిపించుకోవాలని ఆశిస్తున్నాను.

**- ఎడిటర్**




# మరణం తరువాత నీ గమ్యము ఎటు?

కొందరు గమ్యము లేని జీవితము జీవిస్తారు. కొందరు గురి, గమ్యము కలిగి జీవిస్తారు. కానీ ఎవరికైననూ చివరి గమ్యము మరణం. మరణించుట అనే మాటను మాట్లాడటానికి కానీ, వినడానికి కానీ ఏ మనుష్యునికి ఇష్టం ఉండదు. కోరుకున్ననూ, కోరుకొనకపోయిననూ మరణం అందరికీ వచ్చును. కనుక మరణం గురించి భయపడటములో అర్ధం లేదు. కానీ అర్ధం చేసుకోవలసింది ఒకటి ఉంది. మరణం తరువాత నీ గమ్యం ఎటు? కొందరు మరణం తరువాత మరలా జన్మిస్తామని పునర్జన్మ సిద్ధాంతమును నమ్మి కొన్ని పుణ్యకార్యములు చేసి, మరలా మానవునిగా పుట్టాలని తపిస్తారు. మరికొంతమంది పుట్టుట గిట్టుటకే అని కొట్టి పారేస్తారు. కానీ పుట్టటం, చనిపోవటం ఎందుకు? అని ఒక్క క్షణం ఆలోచిస్తే దేవుని ప్రణాళిక, ఉద్దేశాలు కనిపిస్తాయి. దేవుడు నేలమంటిని తీసుకొని మానవుని సృజించి, జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను. ఆత్మ ఎల్లప్పుడూ జీవిస్తూ ఉండాలని దేవుని ఉద్దేశము. నీ ఆత్మ ఎక్కడికి వెళ్ళును అని ఎప్పుడైనా యోచించితివా?

లూకా 16వ అధ్యాయంలో ఒక ఉదాహరణను తెలుసుకుందాము. ధనవంతుడు ఒకడుండేవాడు. ప్రతి దినము బహుగా సుఖ పడుచుండెడివాడు. లాజరు అను ఒక దరిద్రుడుండెను. అతడు ధనవంతుడు పడవేయు రొట్టెముక్కలతో ఆకలి తీర్చుకొనగోరెను. ఆ దరిద్రుడు చనిపోయి దేవదూతలచేత అబ్రహాము రొమ్మున ఆనుకొనుటకు కొనిపోబడెను. ధనవంతుడు కూడా చనిపోయి పాతిపెట్టబడెను. అప్పుడతడు పాతాళంలో అగ్నిజ్వాలలమధ్యను యాతన పడుచూ, కన్నులెత్తి దూరం నుండి అబ్రహామును చూచి వేలి కొనలను నీళ్ళలో ముంచి నా నాలుకను చల్లార్చుటకు లాజరును పంపమని బ్రతిమాలుకొనుచుండెను. కానీ అవకాశం దొరకలేదు.

ధనవంతుడు నిత్య నరకంలోను, బీదవాడైన లాజరు దేవుని రాజ్యంలో ఉండటం జరిగింది. ప్రతి మనుష్యుడు మరణం తర్వాత ఏదో ఒక స్థలమునకు చేరవలసి ఉన్నది.

ధనవంతుడు ధనమునందే నమ్మిక నుంచుకొని ప్రేమ, దయ, కనికరం లేకుండా తన ఇష్టాను సారముగా జీవించి, మరణం తరువాత ఏమి జరుగునో అని యోచించుకొనక జీవించెను. అందుకే పాతాళంలో యాతన పడుచుండెను. లాజరు దరిద్రతను అనుభవిస్తూ కూడా మరణం తరువాత నిత్యజీవము ఉంటుందని నమ్మి దేవుని యందు విశ్వాసముతో జీవించడం ద్వారా పరలోకమునకు ఆహ్వానించబడ్డాడు.

కాబట్టి ప్రియులారా! మరణించిన తరువాత మీ ఆత్మ ఎక్కడికి వెళ్ళాలని ఆశపడుచున్నారు? ప్రభువైన యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి జీవించుట ద్వారా పరలోక రాజ్యమునకు వారసులవుతారు.

– ఎడిటర్




# బైబిల్ క్విజ్ -1

1. 'అతడు భక్తిగలదైవజనుడు' ఈ మాట ఎవరు ఎవరిని గురించి చెప్పారు?
2. సరళవృక్షము క్రింద కూర్చొని తీర్పు తీర్చే ప్రవక్త్రిని ఎవరు?
3. నా ప్రాణము ప్రభువును ఘనపరుచుచున్నది. ఈ మాట పలికినది ఎవరు?
4. మనోదు:ఖము కలిగినదై దేవుని సన్నిధిలో విజ్ఞాపన చేసిన స్త్రీ ఎవరు?
5. కవలలను కనిన మొదటి స్త్రీ ఎవరు?
6. గుడారములో దీవెన పొందిన స్త్రీ ఎవరు?
7. పనూయేలు కుమారై కన్యత్వము మొదలు ఏడేండ్లు పెనిమిటితో సంసారము చేసిన ప్రవక్త్రిని ఎవరు?
8. స్వప్నమందు దేవుని హెచ్చరిక పొందిన రోమా గవర్నర్ భార్య ఎవరు?
9. బైబిల్‌లో పాత నిబంధనలో ఎన్ని పుస్తకములు కలవు?
10. క్రొత్తనిబంధనలో ఎక్కువ పుస్తకములు వ్రాసిన భక్తుడు ఎవరు?

ఈ ప్రశ్నలకి సరైన రిఫరెన్సులతో సమాధానాలు నవంబరు 30వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానాలు వ్రాసిన వారి పేర్లు జనవరి పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా:**

**ఎడిటర్ - స్పర్శ**
ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6,
భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500070

**'స్పర్శ'** అనే మన ద్వైమాస పత్రిక పరిచయ సంచిక ఉచితం. రెండవ సంచిక అనగా జనవరి 2009 నుండి ప్రతి విడి పత్రిక రూ.10/–లు, సంవత్సర చందా రూ. 50/–లు, జీవితకాల చందా రూ. 1000/–లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

మీ ప్రార్థనావసరతలు:

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్–70, ఫోన్: 040–2420 2227

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక! ఈ పత్రిక ద్వారా మీకు జన్మదిన మరియు క్రిస్మస్ శుభాకాంక్షలు.

**"నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితములమీద ఉండును గాక! "**

**భాగ్యలత:** సుధారాణి, హెప్సీబా, గణేష్, మణి, మేఘన, ప్రజ్ఞ, ఎస్.ప్రవీణ్, ప్రవల్లిక, అభిషేక్, కనికరమ్మ, రూప, థామస్, రమేష్, తార్షీనా, రాజ్‌కుమార్, అమూల్య, చంద్రశేఖర్, పుష్పలత, రాధిక, లూథియ, సతీష్, నవీన్, కరుణ, క్రిష్ణవేణి, ప్రవీణ్, ఆశీర్వాదమ్, ఎన్. దివ్యజ్యోతి, ఫిన్నినోయల్.

**చింతల్:** రాజ్‌కిరణ్, శశాంక్, మార్గరేట్, దానియేల్, వెంకటేశ్వరరావు, పి.మంజుల, నాగేశ్వరరావు, దివ్యజ్యోతి, ఎస్తేరు రాణి, పావని, సుహాసిని, సల్మాన్, లక్ష్మారెడ్డి.

**అనాజ్‌పూర్:** జి.థామస్, మరియమ్మ, కె.నీలిమా, కిరణ్, స్వాతి, కె.కృపావరం, హేమలత, రూతు, శ్రీకాంత్.

**సూర్యాపేట:** యు.స్వీటీ, వి.నిరీక్షణ, కె.అనితారాణి, రాజ్‌కుమార్, కృపారాణి, చైతన్య, రవి, అనూష, ఎలీషా, టి.తేజ, రేణుక, మహేష్, సతీష్, మమత,ఆర్.రాజేష్.

**ఇ.సి.ఐ.ఎల్:** ప్రేమ్‌కుమార్.

**కేతేపల్లి:** జేమ్స్, రత్నకుమారి, సంతోషి, ఇ.హేమలత, జె.లింగయ్య, ఎ.మమత, మోజస్, జాకబ్, ఆమోస్, గుణవతి, లూథియ, స్తెఫన్, ప్రసన్న.

# ఎపఫ్రా మినిస్ట్రీస్

## గుంటూరులో నిర్వహించిన
## యూత్ రిట్రీట్‌లో పాల్గొనిన యౌవనస్థులు









## ఎడిటర్ గురించి...

ఎపఫ్రా గారు 1990 సంవత్సరములో క్రీస్తుని ఎరిగి, 1998 లో ఇద్దరికి క్రీస్తు ప్రేమను బోధించుట ప్రారంభించి, దైవచిత్తాను సారముగా 2004లో ఎపఫ్రా మినిస్ట్రీస్ స్థాపించి సంపూర్ణకాల సేవా పరిచర్యలో వున్నారు. హైదరాబాదు పరిసర ప్రాంతాలలో నిర్వహించిన ఆరాధనలు, సువార్త సభలద్వారా అన్యులు, నామకార్థపు అనుభవాలలో ఉన్నవారు మార్పుచెంది దేవుని రాజ్యము కొరకు సిద్ధపరచబడుచున్నారు.

క్రీస్తును గురించి బోధించుట మాత్రమే కాదు, బోధించిన దాని ప్రకారం జీవించడం ద్వారా అనేకులను క్రీస్తువైపుకు ఆకర్షించగలమని అంటారు. మనము భూమి మీద జీవిస్తున్న ఒక్క జీవితాన్ని ప్రభువుకు అర్పించి, ఆదర్శ ప్రాయమైన జీవితం జీవించమని ప్రోత్సహిస్తూ ఉంటారు.

పరిచర్యలో ప్రకటిస్తున్న బోధలు విన్న అనేకులు తమ దుర్వ్యసనాలను, పాపపు మార్గాలను విడిచిపెట్టి క్రీస్తు కొరకు జీవించాలనే తపన కల్గి ఉన్నారు. వీరిలో అనేకులు పరిచర్యను తమదిగా భావించి, తమ ధనాన్ని, తమ సమయాన్ని వ్యయపరుస్తూ పరిచర్యలో పాలి భాగస్థులుగా వున్నారు. వీరిని అనుగ్రహించిన సర్వశక్తుడైన దేవునికి కృతజ్ఞతలు చెల్లిస్తుంటారు బ్రదర్ ఎపఫ్రా గారు. ఎందుకంటే వీరు ఐక్యతతోను, ప్రేమతోను ఒకరికొకరు సహకరించుకుంటూ చివరికి ప్రాణమును కూడా లక్ష్యపెట్టక దేవుని పరిచర్యను కొనసాగించాలనే తపన కల్గి ఉన్నారు.

అనాధలను, విధవరాండ్రను, నిరాదరణకు గురైనవారిని వాక్యముతో ధైర్యపరుస్తూ ఆదరిస్తున్నారు. ఈ విధమైన క్రీస్తు మనస్సును ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని బోధిస్తుంటారు.

పరిచర్యలో ప్రకటిస్తున్న బోధలు సామాన్యమైనవారు అర్థం చేసుకొనేవిగాను, ఆచరింపదగినవిగాను మరియు 10 సంవత్సరాలుగా స్థిరమైనవిగాను, మార్పులేనివిగాను వున్నాయి. దేవునిలో బాధ్యతగా జీవించి, జయజీవితం జీవించాలనే తపన కల్గినవారు ఎపఫ్రా ఎపఫ్రా మినిస్ట్రీస్‌కు ముఖ్యులు. బంధుప్రీతికి, సమాజస్థాయికి మరే ఇతర హోదాకు తావులేని నిష్పక్షపాతమైన పరిచర్యగా ఎపఫ్రా మినిస్ట్రీస్ కొనసాగింపబడుతున్నది.

# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్-500 070
Ph: 040-24202227 email: mail2church@gmail.com